



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

అకాల వర్షం.. అపార నష్టం..



- ఉమ్మడి జిల్లాల్లో 15వేల ఎకరాలకుపైగా దెబ్బతిన్న పంటలు
- ఆర్థికంగా నష్టపోయిన రైతులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

చేతికొచ్చిన పంట ఉరుములు, మెరుపులు, వడగండ్ల వర్షాలతో పంటలు దెబ్బతినడంతో రైతన్న దిగాలపడ్డాడు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి చివరకు చేతికి వచ్చే సమయానికి అకాల వర్షాల వలన దెబ్బతినడంతో రైతు కోలుకోని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. వర్షాల వల్ల మిరప, వరి, మొక్కజొన్న, మినుము, నువ్వులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గురువారం కురిసిన వర్షానికి 15వేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. నంద్యాల జిల్లాలో దాదాపు 12,265 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అందులో 7802 ఎకరాల్లో మొక్కజొన్న, 3,367 ఎకరాల్లో వరి, 552 ఎకరాల్లో మినుము, 35 ఎకరాల్లో ప్రొద్దుతిరుగుడు, 167 ఎకరాల్లో కొర్ర, 50 ఎకరాల్లో ఆముదం, 190 ఎకరాల్లో నువ్వులు దెబ్బతిన్నాయి. నంద్యాల జిల్లాలోని దొర్నిపాడు, సంజామల కోయిలకుంట్ల, ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ, గోస్పాడు, సిరివెళ్ల, చాగలమర్రి, బండి ఆత్మకూరు, గడివేముల, బనగానపల్లి మండలాల్లో పంట నష్టం తీవ్రంగా ఉంది. కర్నూలు జిల్లాలో అరటి, బొప్పాయి, మునగ, టమాట పంటలకు నష్టం జరిగింది. కర్నూలు మండలంలోని జి. సింగవరం, ఆర్. కొంతలపాడు, పడిదెంపాడు, పసుపల, నందనపల్లె, బి. తాండ్రపాడు, దిన్నెదేవరపాడు, గార్గేయపురం ప్రాంతాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం జరిగినట్లు ఆయా శాఖల అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మొక్కజొన్న 1,257 ఎకరాలు, ఆముదం 93, జొన్న 12 ఎకరాల్లో కలిపి మొత్తం 1,363.55 ఎకరాల్లో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లింది. బి. తాండ్రపాడు, గార్గేయ పురం, పసుపల గ్రామాల్లో అరటి 1.20 హెక్టార్లు, బొప్పాయి 1.20, మునగ 3.20, టమాట 1.40 హెక్టార్లలో నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేశారు. ఉద్యాన పంటలకు రూ.17.50 లక్షలు, వ్యవసాయ పంటలకు రూ.కోటికి పైగా నష్టం జరిగింది. జిల్లావ్యాప్తంగా 3 వేల హెక్టార్లలో మామిడి సాగైంది. పిందెలు రాలిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

9782 ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

నంద్యాల జిల్లాలో వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అందులో 7,737 ఎకరాల్లో మిరప పంట దెబ్బతినగా, 137 ఎకరాల్లో అరటి 54.8, 42 ఎకరాల్లో మామిడి, 30 ఎకరాల్లో పసుపు 12, 22 ఎకరాల్లో బొప్పాయి, 8 ఎకరాల్లో కూరగాయలు దెబ్బతిన్నాయి. మొత్తంగా నంద్యాల జిల్లాలో 9,782 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. రూ.485.44 లక్షలు పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఉద్యాన అధికారులు వెల్లడించారు.

క్షయవ్యాధిపై జిజిహెచ్‌లో అవగాహన

- ఆస్పత్రిలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం
- జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

క్షయ వ్యాధిపై కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో అవగాహన ప్రదర్శన, సమావేశం నిర్వమించారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవ సందర్భంగా కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీ నుంచి కర్నూలు మెడికల్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన కలెక్టర్ పి.కోటేశ్వరరావు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆసుపత్రి ప్రాంగణం నుండి కర్నూలు వైద్య కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓల్డ్ లెక్చరర్స్ గ్యాలరీలో క్షయ వ్యాధిపై అవగాహన సమావేశం నిర్వహించారు. జాతీయ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యులు , సిబ్బంది పేషెంట్స్ కు చేసిన సేవలకు వారికి సర్టిఫికెట్స్ , మేమెంటోస్‌తో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర రెడ్డి, కర్నూలు వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధీర్, డిఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, డిఐఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్, హాస్పిటల్ అడ్మిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాలనాగాంజన్, ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ రమేష్, డాక్టర్ మోక్షజ్ఞుడు, డాక్టర్ భాస్కర్, వైద్యులు, అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

తుగ్గలిలో క్షయ వ్యాధిపై అవగాహన

తుగ్గలి : మండల కేంద్రమైన తుగ్గలి, పగిడిరాయి గ్రామాలలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని క్షయ వ్యాధిపై వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ అవగాహన కల్పించారు. అయన మాట్లాడుతూ క్షయ వ్యాధి రోగిలో రెండు వారాలపైగా నిరంతరంగా దగ్గు, చాతి నొప్పి, శ్వాస ఆడక పోవుట, కఫంలో రక్తం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. క్షయ వ్యాధి ఊపిరితిత్తులను ప్రభావితం చేయడమే కాకుండా ఒక్కోసారి మూత్రపిండాలు, వెన్నెముక, మెదడు, గర్భాశయం వంటి కీలక అవయవాలను సైతం ప్రభావితం చేస్తుందన్నారు. టిబి ఎలా వ్యాప్తి చెందుతుందో వివరించారు. టిబి లక్షణాలతో బాధపడే రోగులు సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ఉచిత వైద్య సేవలు పొందవచ్చన్నారు. వైద్యాధికారి హరిత, సూపర్వైజర్లు నాగమ్మ, సచివాలయం ఆరోగ్య కార్యదర్శి మహాలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూ సర్వే తప్పులు లేకుండా నిర్వహించాలి

- కలెక్టర్ పి.కోటేశ్వర రావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

భూసర్వేలో గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వైసిపి జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీ సర్వేకు సంబంధించిన కార్యక్రమాలపై తహసీల్దార్లు , డిప్యూటీ తహశీల్దార్లు (సర్వే), సర్వే అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 100 సంవత్సరాల తర్వాత జరుగుతున్న రీ సర్వే పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేందుకు రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వే పనులకు సంబంధించిన రిజిస్టర్లు , డాక్యుమెంట్స్ రాబోయే 4,5 తరాల వారు ఉపయోగిస్తారని, అందువల్ల ఇందులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగులో ఉన్న మ్యుటేషన్ కరెక్షన్స్, మ్యుటేషన్ ట్రాన్సక్షన్స్, డేటా ఎంట్రీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ ఫేస్-1 లో 472 రెవెన్యూ గ్రామాలకు గాను 68 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి అందుకు సంబంధించిన ఓఆర్ఐ లు కూడా వచ్చాయని, ఫైనల్ ఆర్ఒఆర్ లు కూడా ఇచ్చామని పేర్కొన్నారు. వెబ్ ల్యాండ్ నుండి వెబ్ ల్యాండ్ 2.0 కి పోర్టింగ్ ప్రక్రియ పూర్తి చేసిన మొదటి జిల్లా కర్నూలు అని తెలిపారు. గ్రౌండ్ ట్రూథింగ్ నివేదికలు గ్రామాల వారీగా ప్రతి రోజు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రీ సర్వేకు సంబంధించిన ఫామ్ 1 షెడ్యూల్ ప్రతి ఒక్క భూమి యజమానికి వాలంటీర్ల ద్వారా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రాఫ్ట్ ఆర్ఒఆర్ రాగానే గ్రామ సభ ఏర్పాటు చేసి ఏదైనా అప్పీల్ చేసుకోవాలంటే 14 రోజులు సమయం ఉంటుందని చెప్పాలని, ఫైనల్ ఆర్ఒఆర్ రాగానే మరల గ్రామ సభ ఏర్పాటు చేసి ఏదైనా అప్పీల్ చేసుకోవాలంటే సంవత్సరం పాటు సమయం ఉంటుందని చెప్పాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి డిఆర్ఓ మల్లికార్జునుడు, కర్నూలు ఆర్‌డిఒ హరి ప్రసాద్, సర్వే అండ్ ల్యాండ్ ఎడి పవన్ కుమార్, కెఆర్‌సిసి స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్న లక్ష్మీ, డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే విజయ సారధి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు



సదస్సులో పాల్గొన్న అధికారులు

సిల్వర్ జూబ్లీలో జాతీయ గ్రంథాలయ సదస్సు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కర్నూలు లోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో ఇండియన్ కౌన్సిల్ అఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్, న్యూ ఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో రెండు రోజుల జాతీయ గ్రంథాలయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. కళాశాల గ్రంథాలయ శాఖ అధికారి నాయకంటి మద్దయ్య సమన్వయ కర్తగా జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బివి సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య డి.శ్రీనివాసులు విశిష్ట అతిధిగా శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్‌కె. పద్మిని, సెమినార్ డైరెక్టర్‌గా డాక్టర్. అవినేని కిషోర్ లు హాజరయ్యారు. ముఖ్య అతిధి డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రంథాలయ శాస్త్రంలో జాతీయ సదస్సు చాల అరుదు అని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో గ్రంథాలయాలు సాంకేతికతను అందుకుని డిజిటల్ లైబ్రరీలుగా రూపాంతరం చెందుతున్నాయన్నారు. గ్రంథాలయ ప్రధాన్యతను తెలుపుతూ... విద్యార్థులకు కావలిసిన సమాచార వనరులు ఆన్‌లైన్ ద్వారా పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఆహ్వానితులు, పత్ర సమర్పకులు విద్యార్థులు పాల్గొన్నారు.

త్రిపురలో కార్మిక వర్గంపై ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి గుండాల దాడులు దారుణం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

త్రిపుర రాష్ట్రంలో ఎన్నికల అనంతరం ఓట్లు తక్కువ వచ్చాయని, సీట్లు తగ్గాయని ప్రతిపక్ష వామపక్ష పార్టీల పైన కార్మిక వర్గం పైన ఆర్‌ఎస్‌ఎస్ దాని అనుబంధ సంఘాలు , బిజెపి పార్టీ కార్యకర్తలు సిఐటియు కార్యాలయాల పైన , సిఐటియు కార్యకర్తల ఇండ్లపైన ధమనకాండను ప్రజాతంత్ర వాదులు ఖండించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు అన్నారు. త్రిపురలో కార్మిక వర్గంపై దాడులను నిరసిస్తూ కర్నూలు సిఐటియు కార్యాలయం నుండి సుందరయ్య జంక్షన్ వరకు ప్రదర్శనగా వెళ్లి నిరసన తెలిపారు. సిఐటియు నగర కార్యదర్శి సాయిబాబా అధ్యక్షతన జరిగిన సభలో అంజిబాబు మాట్లాడారు. ఈ మధ్యకాలంలో త్రిపుర ఎన్నికల్లో ఊహించిన దానికంటే బిజెపికి తక్కువ ఓట్లు ,సీట్లు రావడాన్ని జీర్ణించుకోలేని మతోన్మాదులు ప్రతిపక్ష పార్టీలపైన, కార్మిక వర్గం పైన దాడులు చేశాయన్నారు. ఈ దాడులు క్షమించరానిదని, ఈ దాడులను సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా త్రిపురలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిందని ఆ ప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగించారని ఉద్యమాల పైన ,ఆందోళన పైన తీవ్రమైన నిర్బంధాన్ని కొనసాగించారని అన్నారు. నిర్బంధాన్ని సహించలేని ప్రజలు ఎన్నికలలో బుద్ధి చెప్పారని, సావబోయి కన్నులొట్ట పోయినట్లు రెండే రెండు సీట్లతో మళ్ళీ తిరిగే అధికారంలోకి వచ్చిందని తెలిపారు. సీట్లు, ఓట్లు తగ్గాయని భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య దేశంలో క్షమించరానిదని అన్నారు. దేశవ్యాప్తంగా సిఐటియు దీన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన కొనసాగిస్తుందని, అందులో భాగంగానే కర్నూలులో కూడా ఆందోళన చేసినట్లు తెలిపారు. నష్టపోయిన కార్మికులకు సంఘీభావంగా కార్మికుల ద్వారా సంఘీభావ నిధిని సేకరించి కార్మికులకు సంఘీభావ నిధిని పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.గోపాల్ సుధాకరప్ప, ఏసు, ప్రసాద్ ,ఉస్మాన్ బాష, మదన గోపాల్ పాల్గొన్నారు.



నిరసననుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు



డిసిసి సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

రాహుల్ గాంధీ పై కక్షపూరిత చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాహుల్ గాంధీ పై బిజెపి కక్షపూరిత చర్యలు మానుకోవాలని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎం.సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో డిసిసి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు సుధాకర్ బాబు మాట్లాడుతూ మోడీ నియంతృత్వ ధోరణిని అడ్డుకున్నందుకు అక్రమ కేసులు బనాయించారన్నారు. రాహుల్‌గాంధీ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆదాని కేసును నీరు గాడ్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్ ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న ఇతర నాయకులు పాల్గొన్నారు.

గుండె పోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-వెల్దుర్తి



వెల్దుర్తి మండలం కృష్ణాపురం గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్ లో గణిత ఉపాధ్యాయుడు చిన్న మద్దయ్య (51) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందారు. ఓర్వకల్లు మండలం కొంతలపాడుకు చెందిన ఆయన లెక్కల మాస్టర్‌గా 1997లో ఉద్యోగం లో చేరారు. 2017 నుండి కృష్ణాపురం జిల్లా పరిషత్ హైస్కూలులో పనిచేస్తున్నారు. పాఠశాలలో ప్రిన్సిపల్ వరలక్ష్మి ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. అందరు మాట్లాడాక చిన్నమద్దయ్య మాట్లాడి విద్యార్థులకు బెస్ట్ ఆఫ్‌లక్‌తో పాటు పరీక్షలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మరో ఉపాధ్యాయుడు మాట్లాడుతుండగా పక్కకుర్చీలో కూర్చున్న చిన్నమద్దయ్య తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలాడు. సహచర టీచర్లు వెంటనే ఆటోలో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగా ఈ లోగా ఓర్వకల్లువైపు నుంచి 108 వాహనం వచ్చి మార్గమధ్యంలో ఉపాధ్యాయుడుని పరీక్షించగా అప్పటికే చనిపోయినట్లుగా నిర్ధారించారు. గుండెపోటుకు గురై చిన్న మద్దయ్యా మతి చెందినట్లు తెలుస్తోంది. మృతి పట్ల పాఠశాల తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది ఎపిటిఎఫ్ నాయకులు సంతాపం తెలిపారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

హెల్మెట్ పై అవగాహనకు ఎస్‌పి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

రోడ్డు భద్రతలో భాగంగా హెల్మెట్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ జిల్లా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ శుక్రవారం కర్నూలు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్‌పి హెల్మెట్ ధరించి బైక్ నడిపి హెల్మెట్ అవగాహన ర్యాలీని ఉత్సాహపరిచారు. పోలీసులు హెల్మెట్లు ధరించి కర్నూలు పట్టణంలో ద్విచక్రవాహనాలపై తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ హెల్మెట్ ర్యాలీ కంట్రోల్ రూమ్ మీదుగా కిడ్స్ వరల్డ్, రాజ్ విహార్ నుండి కలెక్టరేట్ కు చేరుకుంది. కలెక్టరేట్ దగ్గర ఎస్‌పి మీడియాతో మాట్లాడారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వం , డిజిపి ఆదేశాలు జారీ చేశారన్నారు. అందులో భాగంగా గత 3 ఏళ్లల్లో కర్నూలు జిల్లాలో 2021 లో 361 మంది రోడ్డు ప్రమాదాలలో చనిపోగా, 700 పైగా మంది గాయ పడ్డారన్నారు. 2022 లో 357 మంది చనిపోగా, 706 మంది గాయపడ్డారన్నారు. 2023 లో ఇప్పటివరకు 45 మంది చనిపోగా, 109 మంది గాయ పడ్డారన్నారు. ఈ విధంగా రోడ్డు ప్రమాదాలు జరిగి మరణిస్తే వారి పై ఆధారపడిన కుటుంబాల పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా ఒత్తిడి గురవుతారన్నారు. కాబట్టి ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. 70 శాతం రోడ్డు ప్రమాదాలలో ద్వి చక్ర వాహనాల ప్రమాదాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రమాద సమయంలో తలకు దెబ్బలు తగలడం వలనే ప్రాణాలను కోల్పోతున్నారని, దీనికి హెల్మెట్ ధరించకపోవడమే ప్రధానకారణమన్నారు. వ్యక్తిగతంగా తాను ఎక్కడ ఉన్నా కూడా జిల్లా ఎస్పీ గా స్వయంగా బైక్ పై వెళ్ళేటప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరిస్తామన్నారు. పోలీసు శాఖలో బైక్ నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ట్రాఫిక్ మిత్ర అనే కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినట్లు కనబడితే ఫోటో తీసి కర్నూలు ట్రాఫిక్ మిత్ర పోర్టల్ కు పంపే విధంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ట్రాఫిక్ డిఎస్‌పి నాగభూషణం , కర్నూలు పట్టణ డిఎస్‌పి కెవి మహేష్, కర్నూలు పట్టణ సిఐలు శంకరయ్య, శ్రీనివాసులు, తబ్రేజ్ , తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది , సుజికి షోరూమ్, బజాజ్, ఎంజి బ్రదర్స్, ఎస్ఎస్ హోండా, వాసవి హోండా, సస్యహీరో, టివిఎస్ షోరూమ్ లకు చెందిన మెకానిక్స్, సిబ్బంది 500 మంది వరకు పాల్గొన్నారు.



5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కార్మిక, కర్షక, కౌలు రైతు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ అన్ని యూనియన్ల ఆఫీస్ బేరర్స్ సమావేశం సుర్జీత్ భవన్‌లో శుక్రవారం సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎం. రాజశేఖర్, రాజగోపాల్, నగర ప్రధాన కార్యదర్శి మారెళ్ళ రామాంజనేయులు (విజయ్)లు మాట్లాడారు. దేశంలో బిజెపికి అధికారం వచ్చిన తర్వాత దేశ స్వతంత్ర పునాదులైన లౌకిక, సామ్యవాద, సౌభ్రాతృత్వాలను, రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ దేశాన్ని నాశనం చేస్తుందని విమర్శించారు. బ్రిటిష్ కాలం నాడే పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్లుగా మార్చి బిజెపి ప్రభుత్వం అమలు చేయాలని చూడడం దుర్మార్గమన్నారు. దేశ ప్రజలందరూ వారి కష్టం ద్వారా సంపాదించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి, రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఎయిర్ లైన్స్, విశాఖ ఉక్కు లాంటి పరిశ్రమలను గుజరాత్ కార్పొరేట్ సంస్థల యజమానులైన అదాని, అంబానీలకు కారు చౌకగా అప్పనంగా అప్ప చెప్పడం వారి మోసగారితనానికి నిదర్శనం అన్నారు. దేశ ప్రజలు కార్మికులు, కర్షకులు ఐక్యం కాకుండా మతం పేరున కులం పేరునా విభజించి పాలించి వలసవాద బ్రిటిష్ వాడి వారసత్వాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు, దేశ ప్రజలందరూ కార్మికులు కర్షకులు వ్యవసాయ కార్మికులు ఐక్యమై బిజెపి దుర్మార్గ మోసపూరిత విధానాలను రద్దు చేసుకుని, ప్రజా కార్మిక అనుకూలమైన విధానాలను అమలు చెయ్యాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లక్షలాది మందితో ఢిల్లీ బిజెపి చెవుడు వదిలే రకంగా, ఢిల్లీ దద్దరిల్లె పోరాటాలు చేయాలన్నారు. కార్మికులు, కర్షకులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు అందరూ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.రాజశేఖర్



రోజా దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేస్తున్న టిజి .భరత్

రోజా దర్గా అభివృద్ధికి సహకారం : టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రోజా దర్గా అభివృద్ధికి ఎలాంటి సహకారం కావాలన్నా టిజివి సంస్థల నుండి అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కర్నూల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి జి భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని 48వ వార్డులోని రోజా దర్గా ఉరుసు కార్యక్రమంలో టిజి భరత్ పాల్గొన్నారు. రోజా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం టిజి భరత్ మాట్లాడుతూ రోజా దర్గా ఎంతో ప్రత్యేకత కలిగినదన్నారు. మా టిజివి గ్రూపు తరుపున ఇప్పటికే ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ఇది ఎంతో మందికి ఉపయోగ పడుతుందన్నారు. రోజా దర్గాకు కుల, మతాలకు అతీతంగా అందరూ వస్తారన్నారు. రోజా దర్గాలో అభివృద్ధి కోసం ఎలాంటి సహకారం కావాలన్నా తాము చేసేందుకు ముందుంటామని భరత్ చెప్పారు. రోజా దర్గా ఉరుసు, రంజాన్‌నెల ప్రారంభం ఒకే రోజు రావడంఎంతో మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మన్సూర్ ఆలీఖాన్, రామంజనేయులు, విక్రమ్ సింగ్, రమీజ్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసంలో పరిశుభ్రత పాటించాలి

ఆవాజ్ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో విద్యుత్ కొరత లేకుండా, నిరంతరం మంచినీటి సౌకర్యం తో పాటు, ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాలలో, మసీదు లలో పరిశుభ్రంగా ఉంచాలని, ఆవాజ్ కమిటీ నగర అధ్యక్షులు పి.ఇక్బాల్ హుస్సేన్, నగర కార్యదర్శి మహమ్మద్ షరీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో చాలామంది ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ఉపవాసాలతో ఉంటారని, అటువంటి ఈ మాసంలో ముస్లింలు అధికంగా నివసిస్తున్న ప్రాంతాలలో, పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. మంచినీటి కొరత, విద్యుత్ కోత లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. పారిశుధ్య సిబ్బందిని అవసరమైతే ఎక్కువ సంఖ్యను పెంచు కోవాలని, నగర వాసులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన, అధికారుల పైన ఉందని వారు గుర్తు చేశారు. పవిత్రమైన ఈ రంజాన్ మాసంలో, అధికారులు గట్టి చర్యలు తీసుకోని, ఎటువంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని కోరారు.

రైల్వే డబుల్ లైన్ కోసం పొలం సేకరణ

- పొలం సంబంధిత రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ, తహశీల్దార్

ప్రజాశక్తి - చిప్పగిరి


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

గుంతకల్లు సమీపంలో ఉన్న నంచర్ల గ్రామంలో రైల్వే లైన్ ఉంది. రైల్వే డబుల్ లైన్ వేసేందుకు శుక్రవారం ఆర్‌డిఒ మోహన్‌దాస్, స్థానిక తహశీల్దార్ లక్ష్మీనారాయణ రైల్వే లైన్ సమీపంలో ఉన్న పొలం సంబంధిత రైతులతో పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైల్వే డబుల్ లైన్‌కు అవసరమైన పొలం ఇచ్చిన రైతులకు ప్రభుత్వం మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లిస్తుందన్నారు. ఇందులో ఏ రైతుకు కూడా అపోహలు వద్దన్నారు.

మధ్యాహ్న భోజనం, సచివాలయం తనిఖీ

నంచర్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజనాన్ని ఆర్‌డిఒ మోహన్‌దాస్, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎఒ ఆనంద్ పరిశీలించారు. మధ్యాహ్న భోజనంపై నిర్వాహకులతో మాట్లాడుతూ... పిల్లలకు సంతృప్తికరమైన భోజనం వడ్డించాలన్నారు. అనంతరం బెల్డోనా గ్రామంలో సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది పనితీరు, అటెండెన్స్ రికార్డులను, మూవ్‌మెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. సమయపాలనకు ప్రాధాన్యత ఇచ్చి వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఏ విధులు అప్పజెప్పినా అలసత్వం వహించకుండా పూర్తి చేయాలన్నారు. వైస్ ఎంపిపి నరసింహులు, సర్పంచి భీమా, విఆర్‌ఒ రంగన్న, సర్వేయర్లు రాము నాయక్, హనుమాన్ నాయక్, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణతకు కృషి

- ఎస్ఎస్ఎ ఎపిసి వేణుగోపాల్

ప్రజాశక్తి - హొళగుంద


విద్యార్థులతో మాట్లాడుతున్న వేణుగోపాల్

పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ బోధన సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక కెజిబివిలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇష్టంతో కష్టపడి చదివితే ప్రతి సబ్జెక్టు సులువుగా ఉంటుందన్నారు. పదో తరగతిని భవిష్యత్తు ఎదుగుదలకు మొదటి మెట్టుగా భావించి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఉన్నతస్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం నాడు-నేడు ఫేస్-2 కింద జరుగుతున్న పనులను అసిస్టెంట్ ఇంజినీర్ వర్ధన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. పనులు నాణ్యతగా ఉండాలని, ఎక్కడా అవినీతి జరగకూడదని తెలిపారు. జిసిడిఒ సునీత, ప్లానింగ్ కోఆర్డినేటర్ మారుతి, సిఆర్‌పిలు రేణుక, లక్ష్మప్ప, తుకారం పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- సొమ్ము రికవరీ - డీఎస్పీ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని 3వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆయా కాలనీల్లో ఆభరణాలను అపహరించిన అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం 3వ పట్టణ పోలీసు స్టేషన్‌లో నిందితులను, ఆభరణాలను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్ణాటకలో పోలీసుల సహకారంతో తనిఖీ చేస్తే యోగేష్, కెంచప్పలు గతంలో అరెస్టు చేసి రిమాండ్‌లో పెట్టడంతో ఇక్కడి దొంగతనాలకు సంబంధించిన సిసి ఫుటేజ్‌లను పరిశీలించి, ఫొటోలు తీసుకెళ్లి మ్యాచ్ చేస్తే ట్యాలీ అయిందని తెలిపారు. అక్కడ వారిపై ఉన్న 8 కేసుల్లో 4 కర్నూలుకు సంబంధించినవిగా ఉన్నాయన్నారు. మొత్తం 500 గ్రాముల బంగారం, 475 గ్రాముల వెండి ఆభరణాలను రికవరీ చేసి దొంగతనానికి ఉపయోగించిన కారును సీజ్ చేసినట్లు తెలిపారు. ఆదోని పట్టణంలోని జొనాథన్ విక్లీఫ్ ఇంట్లో జరిగిన దొంగతనం కేసును కూడా ఛేదించామని చెప్పారు. ప్రత్యేక బృందంగా ఏర్పడి కేసును ఛేదించిన సిఐ శ్రీరామ్, ఎస్ఐ ఆర్.జయ శేఖర్, పోలీసులు కృష్ణయ్య నాయుడు, నరేంద్ర, చిన్న వెంకటేశ్వర్లును అభినందించారు.


దొంగలను, రికవరీ సొమ్మును చూపుతున్న డీఎస్పీ

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వ్యవసాయేతర భూములకు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బైచిగేరి, గోనబావి, పర్వతాపురం, హానవాలు, పెద్దహరివాణం గ్రామాల్లో సబ్ కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ భూములకు, వ్యవసాయేతర భూములుగా మార్చుకోవడానికి మార్కెట్ విలువ 5 శాతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవడంతో క్షేత్రస్థాయిలో తనిఖీ చేశామని చెప్పారు.

గ్రామ సచివాలయం తనఖీ : మండలంలోని హానవాలు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఒక మాసంలో సచివాలయం ద్వారా ఎన్ని


జగనన్న కాలనీని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

సేవలు అందించారని ఆరా తీశారు. హాజరు పట్టిక, మూవ్‌మెంట్ రిజిస్టర్, పలు రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సహాయం కోసం కృషి చేయాలని అక్కడే ఉన్న వైద్య సిబ్బందిని ఆదేశించారు. నిర్లక్ష్యాన్ని వీడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

జగనన్న కాలనీ పరిశీలన : పెద్దహరివాణం గ్రామంలోని జగనన్న కాలనీలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల పురోగతిని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పరిశీలించారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఆ దిశగా అధికారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, వివిధ దశలో ఉన్న ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయరాం రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ముఖ్యమంత్రి జగన్ పతనం ప్రారంభం

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చరిష్మా తగ్గిందని, ఇక ఆయన రాజకీయ పతనం ప్రారంభమైందని టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప, మైనార్టీ నాయకులు సౌదీ రావుఫ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సిటీ ప్రెస్ కాంపౌండ్‌లో టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, ఎల్‌ఎల్‌సి మాజీ ఛైర్మన్ బసాపురం రామస్వామి, మాజీ కౌన్సిలర్ రామచంద్రతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేల సంఖ్యకు అనుగుణంగా ఎమ్మెల్సీ అభ్యర్థులను పోటీకి నిలపాల్సింది పోయి, కావాలనే మరొకరిని బరిలో నిలిపి ముఖ్యమంత్రి జగన్ భంగపాటుకు గురయ్యారని తెలిపారు. రాష్ట్ర ప్రతిపక్ష నాయకులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వయస్సు రీత్యా గౌరవం ఇవ్వకుండా అవహేళనగా మాట్లాడడం ముఖ్యమంత్రి జగన్‌కు పరిపాటిగా మారిందని చెప్పారు. తనకు 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, టిడిపికి కేవలం 23 మాత్రమే ఉన్నారని, ఇది గాడ్ స్క్రిప్ట్ అంటూ జగన్మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారని తెలిపారు. అదే సంఖ్య ఎమ్మెల్యేలతోనే ఎమ్మెల్సీగా అభ్యర్థిని గెలిపించుకున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ప్రతిపక్షాల నాయకుల గొంతు నొక్కడం, భయపెట్టడం, అక్రమ అరెస్టులు పెట్టడం మానుకొని ప్రజా పాలనపై దృష్టి సారించాలని హితవుపలికారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని, గెలుపే లక్ష్యంగా సైనికుల్లా పనిచేస్తామని తెలిపారు. నాయకులు షేక్షావలీ, మల్లేశప్ప, వి.ఎం.గోపాల్, మురళీ, కారుమంచప్ప ఉన్నారు.


అభివృద్ధి పనులపై మంత్రి బొత్సకు నివేదిక ఇస్తున్న ఎమ్మెల్యే ఎర్రకోట

మంత్రి బొత్సను కలిసిన ఎమ్మెల్యే ఎర్రకోట

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విజయవాడ కార్యాలయంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి నియోజకవర్గంలో విద్యాశాఖ అభివృద్ధి నిధులకు సంబంధించిన నివేదికను అందజేశారు. నియోజకవర్గానికి సంబంధించిన పాఠశాలల్లో పలు అభివృద్ధి పనుల గురించి వివరించారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-పెద్దకడబూరు

మండలంలో నౌలేకల్ గ్రామంలో వెలసిన శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం ఆదోని గంగాభవాని దేవి అర్చకులతో సర్పంచి పల్లవి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి జలాభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, పంచామృతంతో పూజలు చేశారు. అలాగే కొత్తగా ప్రతిష్టాపన చేసిన స్వామివారి ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

షాపులు మూసేసి నాయీ బ్రాహ్మణుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

ఇతర కులాలకు చెందిన వారు బార్బర్ షాపులను నిర్వహించడం సమంజసం కాదని నాయీ బ్రాహ్మణులు శుక్రవారం ఆదోనిలో దుకాణాలను మూసేసి నిరసన చేపట్టారు. శుక్రవారం పట్టణంలోని నాయీ బ్రాహ్మణులు తరలివచ్చి వైసిపి నాయకులు జయ మనోజ్ రెడ్డిని కలిశారు. ఆదోనిలో కొత్తగా ఇతరులు నాయీ బ్రాహ్మణ వృత్తి చేపట్టేందుకు దుకాణాలు పెడుతున్నారని, దీనిని నిలిపేయాలని నాయీ బ్రాహ్మణులు షాపులను బంద్ చేసి నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే స్వగృహానికి ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడానికి కృషి చేస్తానని, సెలూన్ షాపులను పెడుతున్న వారిని విచారించి న్యాయం చేస్తానని, కులవృత్తులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జయ మనోజ్ రెడ్డి తెలిపారు. నాయీ బ్రాహ్మణ సంఘం ప్రెసిడెంట్ ఈరన్న, నాయకులు రఘు, వీరేష్, బాల, రంగస్వామి పాల్గొన్నారు.


మనోజ్ రెడ్డి దృష్టికి సమస్యను వివరిస్తున్న నాయీ బ్రాహ్మణులు


మాట్లాడుతున్న ఎంపిపి హేమలత మారయ్య, వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ

జగన్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకాలు

ప్రజాశక్తి - చిప్పగిరి

వాల్మీకులకు చిరుకాల వాంఛ ఎస్టీ బిల్లును అసెంబ్లీలో ఆమోదించినందుకు శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. శుక్రవారం వేర్వేరు కార్యక్రమాల ద్వారా ఎంపిపి జూటూరు హేమలత, వైసిపి కన్వీనర్ మంత్రి సోదరుడు గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా వాల్మీకులకు ఇంత ప్రాధాన్యత ఇవ్వలేదని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వాల్మీకుల ఎస్టీ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేయడం సంతోషంగా ఉందని తెలిపారు. వైసిపి యువ నాయకులు జూటూరు మారయ్య పాల్గొన్నారు. **హాలహర్వి**లో వైసిపి మండల కన్వీనర్ భీమప్ప చౌదరి ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి, జగనన్న చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించారు. వైసిపి యువ నాయకులు, చింతకుంట సొసైటీ ఛైర్మన్ శీనప్ప, వైస్ ఎంపిపి నాగేష్, జడ్‌పిటిసి లింగప్ప పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఉప సర్పంచి శివశంకరప్ప

ప్రజాశక్తి - హాలహర్వి

పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉప సర్పంచి శివశంకరప్ప తెలిపారు. ప్రజ్ఞా వికాసం పదో తరగతి మోడల్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. మండలంలోని నిట్రవట్టి గ్రామం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం మోడల్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉప సర్పంచి ఎం.శివశంకరప్ప ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. బహుమతులను టిడిపి యువ నాయకులు తిప్పే స్వామి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పరీక్షలపై అవగాహన కోసం, పరీక్షల పట్ల భయాందోళనకు గురికాకుండా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఎస్ఎఫ్ఐ పరీక్షలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పోతురాజు, నాయకులు పవన్ పాల్గొన్నారు.

వడ దెబ్బ పట్ల అప్రమత్తత అవసరం

- సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీరన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వడ దెబ్బ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.వీరన్న, వైస్ ప్రిన్సిపల్ కె.సుధాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కడిమెట్ల గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేసవిలో సాధారణ రోజులకంటే ఎక్కువగా నీటిని, పండ్ల రసాలను తీసుకోవాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు ఎక్కువ సేపు ఎండలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ కార్యనిర్వహణ అధికారి వి.రఘు పాల్గొన్నారు.

పంచాయతీ వేలాల్లో 'టిడిపి' కైవసం

- కొద్దిసేపు ఉద్రిక్తత

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కోసిగి మేజర్ పంచాయతీ వేలం పాటలను టిడిపి కోసిగి నాయకులు కైవసం చేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శుక్రవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి సంజిపోగు అయ్యమ్మ అధ్యక్షతన డిఎల్‌పిఒ నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 2023-24 వార్షిక సంవత్సరానికి గాను మేజర్ పంచాయతీ వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటలో వారపు సంత రూ.2.75 లక్షలకు టిడిపి నాయకులు నాడిగేని నరసమ్మ కైవసం చేసుకున్నారు. అలాగే బండి మెట్టను రూ.17.40 లక్షలకు టిడిపి మండల నాయకులు నాడిగేని అయ్యన్న కైవసం చేసుకున్నారు. టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అలాగే చిన్న కమేలాను రూ.28 వేలకు నూర్ అహ్మద్, పెద్ద కమేలాను రూ.80 వేలకు సంజిపోగు అయ్యప్ప దక్కించుకున్నారు. ఈ ఏడాది మేజర్ పంచాయతీకి రూ.21.23 లక్షలు పంచాయతీ వేలంపాటలో ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. గతేడాదితో పోల్చితే పంచాయతీకి రూ.29,500 ఆదాయం పెరిగినట్లు చెప్పారు. టిడిపి నాయకులు ప్రధాన పంచాయతీ వారపు సంత, బండిమెట్టలను కైవసం చేసుకోవడంతో స్థానిక వైసిపి నాయకులు డైలమాలో పడ్డారు. ఎలాగైనా తిరిగి పంచాయతీ వేలాలను దక్కించుకోవాలని అధికారులతో ఒత్తిడి చేయించారు. ఆ ఒత్తిడికి టిడిపి నాయకులు తగ్గకపోవడంతో చేసేదేమీ లేక వైసిపి నాయకులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ప్రధాన పంచాయతీ వేలాలను టిడిపి నాయకులు కైవసం చేసుకోవడంతో టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ ఎరిషావలీ, ఎస్ఐ రాజారెడ్డి పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఎంపిపి ఈరన్న, మాణిక్యరాజు, నాడిగేని నాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎల్‌పిఒ నూర్జహాన్

పట్టణ వాసులకు చేరువలో రిలయన్స్ ట్రెండ్స్

- ఆకర్షణీయమైన ప్రారంభోత్సవ ఆఫర్

ప్రజాశక్తి - ఆదోని

దేశంలో అతి పెద్ద, వేగంగా వృద్ధి చెందుతున్న అప్పరెల్స్, ఫుట్‌వేర్, యాక్సరీస్, ప్రత్యేక చైన్ రిలయన్స్ ట్రెండ్స్ విస్తరిస్తోంది. పట్టణంలోని ఆస్పరి రోడ్ ప్రాంతంలో తమ రెండో నూతన స్టోర్‌ను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. 11,300 అడుగుల విస్తీర్ణం గల ఈ నూతన ట్రెండ్స్ స్టోర్ మంచి నాణ్యత, ఆకర్షణీయమైన దుస్తుల శ్రేణిని కలిగి ఉందన్నారు. అలాగే ఈ స్టోర్ ఆదోని ప్రాంత వినియోగదారుల అభిరుచికి తగిన విధంగా అందుబాటులో ఉండే ధరలతో అత్యధిక విలువను కలిగి ఉందని తెలిపారు. పట్టణానికి చెందిన కస్టమర్లు సంతృప్తికరమైన ధరలకు ఆధునిక ఉమెన్స్ వేర్, మెన్స్ వేర్, కిడ్స్ వేర్, ఫ్యాషన్ యాక్సరీస్ కోసం విలక్షణమైన ప్రత్యేక గొప్ప షాపింగ్ అనుభవం కోసం ఎదురుచూడవచ్చని తెలిపారు. ప్రత్యేకమైన ప్రారంభోత్సవపు ఆఫర్ కింద షాపింగ్ చేస్తే ఆకర్షణీయమైన బహుమతి పొందవచ్చని చెప్పారు. కొనుగోలుపై వినియోగదారులు కూపన్లు పూర్తి ఉచితంగా పొందవచ్చని తెలిపారు.

27న పంచాయతీ వేలం పాటలు

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మేజర్ పంచాయతీలో ఈనెల 27న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు సర్పంచి పాల్ దినకరన్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. పంచాయతీ పరిధిలోని బండి మెట్ట, కమేలా, వారపు సంత, దినసరి మార్కెట్‌కు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు పంచాయతీ నిబంధనల ప్రకారం డిపాజిట్లు చెల్లించాలని కోరారు.

పిడుగు పడి వలస కూలీ మృతి

ప్రజాశక్తి - కౌతాళం

పిడుగు పడి మండలంలోని వల్లూరు గ్రామానికి చెందిన వడ్డే దేవేంద్ర మృతి చెందారు. గ్రామస్తుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన వడ్డే దేవేంద్ర రెండు నెలల క్రితం గుంటూరుకు వలస వెళ్లారు. శుక్రవారం గుంటూరు జిల్లా గొల్లంపల్లి మండలం తరుగుండం పాలెం తండాలో మిరప పంట పొలంలో పని చేస్తుండగా పిడుగు పడి మృతి చెందారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

టిడిపి గెలుపు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి గెలుపు జగన్ ప్రభుత్వానికి చెంప పెట్టని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో, శాసన సభ్యుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులు విజయం సాధించడం శుభపరిణామమని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు వైసిపి ప్రభుత్వానికి ఒక సవాలు అని చెప్పిన వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి ఈ ఎన్నికల ఫలితాలు దిమ్మతిరిగే విధంగా వచ్చాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. అనంతరం బాణసంచా పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ముస్లిం, మైనారిటీలకు శుభాకాంక్షలు తెలిపారు. వేదాలు, పురాణాల ఆధారంగా, సమగ్ర ధర్మ ప్రయత్నాల ఆధారంగా సంస్కృత పండితులు డాక్టర్ వేదప్రకాశ ఉపాధ్యాయ రచించిన 'కల్కి అవతార్ ప్రవక్త మహ్మద్ సల్లెల్లాహు అలైహివసల్లమ్ గారే' పుస్తకాన్ని ఆవిష్కరించారు. మైనార్టీ నాయకులు తురేగల్ నజీర్ అహ్మద్, బడే సాహెబ్, ఖాసీంవలీ, నజీర్ అహ్మద్, దయాసాగర్, రంగస్వామి గౌడ్ పాల్గొన్నారు. అలాగే కోట్ల క్యాంపు కార్యాలయంలో టిడిపి నాయకులు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో, ప్రభుత్వ మానసిక వికలాంగుల కేంద్రంలో మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ డైరెక్టర్ జి.అల్తాఫ్, రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు మాట్లాడారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మాచాని శివకుమార్, మండలం మాజీ ఆత్మ ఛైర్మన్ కందనాతి శ్రీనివాసులు, మల్కాపురం పురుషోత్తం రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కోడిగంటి శంకరన్న, మాసుమాన్‌దొడ్డి శ్రీనివాసులు, టిడిపి ముస్లిం, మైనార్టీ పట్టణ నాయకులు కెఎండి.అబ్దుల్ జబ్బార్, గోరాబాష, మహబూబ్ బాషా, ఆఫ్గాన్ వలీ బాష, టిడిపి ఎస్సీ సెల్ పట్టణ నాయకులు కంపాడు చిన్న రంగన్న, పార్లపల్లి లక్ష్మన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ


కోట్ల క్యాంపు కార్యాలయంలో మిఠాయిలు పంచుతున్న నాయకులు

రవాణా రంగాన్ని పరిరక్షించుకుందాం

- ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

రవాణా రంగ పరిరక్షణ కోసం ఏప్రిల్ 5న చేపట్టే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు హనుమంతు కోరారు. శుక్రవారం ఆదోని సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.తిప్పన్న, పిఎస్.గోపాల్ మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పాలని చూస్తోందని విమర్శించారు. రవాణా రంగాన్ని విచ్ఛినం చేసేందుకు అనేక రకాల నిర్బంధాలకు గురి చేస్తోందన్నారు. జిఒ 21 పేరుతో రవాణా రంగంపై రుద్దడం వల్ల అధిక పెనాల్టీలు, జరిమానాలు, చలానా ధరలు భారీగా పెరిగాయన్నారు. ఆటో యూనియన్ నాయకులు గోవిందు, శంకర్, నాగరాజు, ఉరుకుంద పాల్గొన్నారు.

టిబి వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు

- ఐఎంఎ వైద్యులు

ప్రజాశక్తి - ఆదోని

టిబి వ్యాధిపై నిర్లక్ష్యం చేయవద్దని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ వద్ద కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు టిబిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆదోని ప్రెసిడెంట్ డాక్టర్ ఉషా రావు మాట్లాడారు. ఎక్కువ రోజులు జ్వరం, దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలుంటే క్షయ వ్యాధి ఉందని అనుమానించి వైద్యుని దగ్గరకెళ్లి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వైద్యులు వ్యాధి నిర్ధారణ చేసి మందులు ఇస్తే వాటిని సక్రమంగా వాడాలన్నారు. మందులు సరిగ్గా వాడకపోతే మల్టీ డ్రగ్ రెసిస్టెన్స్ క్షయ వ్యాధి ఎక్కువ అవుతుందని చెప్పారు. సాధారణ మందులు పనిచేయవని తెలిపారు. సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ కృష్ణమూర్తి, న్యూరో ఫిజిషియన్ డాక్టర్ రోహిత్, లయన్స్ క్లబ్ రీజియన్ ఛైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, ఈసీ మెంబర్ వనప రాజు, ఓం ప్రకాష్, గోవింద రావు పాల్గొన్నారు.

దేవనకొండ : క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, 2 వారాలకు మించి దగ్గు ఉంటే దగ్గరలోని ప్రభుత్వాస్పత్రిని సంప్రదించి అధికారులతో పరీక్షలు చేయించుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయి బాబా, వైద్యాధికారి అరుణ జ్యోతి, హెల్త్ ఎడ్యుకేటర్ ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు రామ్మోహన్, హనుమంతమ్మ, ఉమాబాయి, శ్రీధర్, ఫార్మాసిస్టు బాషావలీ, ల్యాబ్ టెక్నీషియన్ నాగేశ్వరరావు, ఎఎన్ఎంలు వెంకటమ్మ, మాధమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు వినీత, విద్య, శ్రీవాణి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఐఎంఎ వైద్యులు


దేవనకొండలో

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని పాలకుర్తి గ్రామంలోని రైతు భరోసా కేంద్రం ఆవరణలో వైఎస్ఆర్ యంత్ర సేవాలో భాగంగా వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. శుక్రవారం సిహెచ్‌సి గ్రూపు రైతులకు 40 శాతం సబ్సిడీతో కూడిన ట్రాక్టర్, వలసముని మిషన్, మూడు మడకలను ఎఒ సురేష్ బాబు, జడ్‌పిటిసి కిట్టు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేవనకొండ, కోటకొండ, నల్లచెల్లిమెల, కరివేముల గ్రామాల్లో సిహెచ్‌సి గ్రూపులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈనెల 30లోపు రైతులు గ్రూపులను తయారు చేసుకోవాలని తెలిపారు. కెడిసిసి బ్యాంకు మేనేజర్ రెడ్డి మధుసూదన్ రెడ్డి, ఎఇఒలు యోగేంద్ర, రంగన్న, జయరాం, పాలకుర్తి సర్పంచి భర్త ప్రతాప్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు శాంతి కుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- కౌన్సిలర్ అంజనమ్మ

ప్రజాశక్తి - ఆదోని

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కౌన్సిలర్ అంజనమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రాగిణి వసంత, సావిత్రి, ఎంఎస్‌కె.దివ్య తెలిపారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎల్‌బి స్ట్రీట్ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తక్కువ ఖర్చులో లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పు ధాన్యాల్లో అధికంగా ప్రొటీన్లు ఉంటాయన్నారు. నిమ్మ పండు, గోంగూర, ఉసిరిలో అధికంగా విటమిన్ 'సి' ఉంటుందన్నారు. ఇది వ్యాధి నిరోధక శక్తి పెంపునకు దోహదపడుతుందన్నారు. నెఎన్ఎంలు శంకరమ్మ, శారద, నాగరత్న, ఈరమ్మ, నిర్మల, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

- ఎంపిడిఒ సుధాకర్ రాజు

చిప్పగిరి : ఈనెల 25న చిప్పగిరి మండల కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సుధాకర్ రాజు తెలిపారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపిపి జూటూరు హేమలత అధ్యక్షతన ఈనెల 25న జరిగే సర్వసభ్య సమావేశానికి మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అధికారులంతా తమ పరిధిలో జరిగిన మూడు నెలల ప్రగతి నివేదికలను సమర్పించాలని తెలిపారు.





అకాల వర్షానికి దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు, తదితరులు

అకాల వర్షం..అపార నష్టం

- ఉమ్మడి జిల్లాల్లో 15వేల ఎకరాలకుపైగా దెబ్బతిన్న పంటలు
- ఆర్థికంగా నష్టపోయిన రైతులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

చేతికొచ్చిన పంట ఉరుములు, మెరుపులు, వడగండ్ల వర్షంతో పంటలు దెబ్బతినడంతో రైతన్న దిగాలపడ్డాడు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి చివరకు చేతికి వచ్చే సమయానికి అకాల వర్షాల వలన దెబ్బతినడంతో రైతు కోలుకోని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. వర్షాల వల్ల మిరప, వరి, మొక్కజొన్న, మినుము, నువ్వులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గురువారం కురిసిన వర్షానికి 15వేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. నంద్యాల జిల్లాలో దాదాపు 12,265 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అందులో 7802 ఎకరాల్లో మొక్కజొన్న, 3,367 ఎకరాల్లో వరి, 552 ఎకరాల్లో మినుము, 35 ఎకరాల్లో ప్రొద్దుతిరుగుడు, 167 ఎకరాల్లో కొర్ర, 50 ఎకరాల్లో ఆముదం, 190 ఎకరాల్లో నువ్వులు దెబ్బతిన్నాయి. నంద్యాల జిల్లాలోని దొర్నిపాడు, సంజామల కోయిలకుంట్ల, ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ, గోస్పాడు, సిరివెళ్ల, చాగలమర్రి, బండి ఆత్మకూరు, గడివేముల, బనగానపల్లి మండలాల్లో పంట నష్టం తీవ్రంగా ఉంది. కర్నూలు జిల్లాలో అరటి, బొప్పాయి, మునగ, టమాట పంటలకు నష్టం జరిగింది. కర్నూలు మండలంలోని జి. సింగవరం, ఆర్. కొంత లపాడు, పడిదెంపాడు, పసుపల, నందనపల్లె, బి. తాండ్రపాడు, దిన్నెదేవరపాడు, గార్గేయపురం ప్రాంతాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం జరిగినట్లు ఆయా శాఖల అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మొక్కజొన్న 1,257 ఎకరాలు, ఆముదం 93, జొన్న 12 ఎకరాల్లో కలిపి మొత్తం 1,363.55 ఎకరాల్లో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లింది. బి. తాండ్రపాడు, గార్గేయ పురం, పసుపల గ్రామాల్లో అరటి 1.20 హెక్టార్లు, బొప్పాయి 1.20, మునగ 3.20, టమాట 1.40 హెక్టార్లలో నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేశారు. ఉద్యాన పంటలకు రూ.17.50 లక్షలు, వ్యవసాయ పంటలకు రూ.కోటికి పైగా నష్టం జరిగింది. జిల్లావ్యాప్తంగా 3 వేల హెక్టార్లలో మాడిపోయే పరిస్థితి. పిందెలు రాలిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వర్షానికి తడిసిపోయిన మిర్చి (ఫైల్)

9782 ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

నంద్యాల జిల్లాలో వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అందులో 7,737 ఎకరాల్లో మిరప పంట దెబ్బతినగా, 137 ఎకరాల్లో అరటి 54.8, 42 ఎకరాల్లో మామిడి, 30 ఎకరాల్లో పసుపు 12, 22 ఎకరాల్లో బొప్పాయి, 8 ఎకరాల్లో కూరగాయలు దెబ్బతిన్నాయి. మొత్తంగా నంద్యాల జిల్లాలో 9,782 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. రూ.485.44 లక్షల పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఉద్యాన అధికారులు వెల్లడించారు.

నష్టం అంచనా వేసి పరిహారం ఇవ్వాలి

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు (మిడుతూరు)

ఇటీవల వడగండ్ల వర్షానికి పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని, తక్షణమే పంట నష్టం అంచనా వేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని జలకనూరు, తలముడిపి, చింతలపల్లి, కాజీపేట, దేవనూరు, తదితర గ్రామాల్లో నష్టపోయిన పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అనేక ఆశలతో లక్షలు పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో వడగండ్ల వర్షంతో రైతులు పంటను నష్టపోయారని తెలిపారు. మిరప పంటకు ఎకరాకు రూ.లక్ష ఖర్చు వస్తే 20 నుండి25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, ఆదాయం 4 లక్షలు వస్తుందని, అలాంటిది పంట మొత్తం నేలరాలిపోయి 30 శాతం కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే మిరప పంటకు ఎకరాకు రూ.లక్ష ఇవ్వాలని, పంటల బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న పంటకు ఎకరాకు రూ.60వేలు, అరటి పంటకు ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని, వీటితోపాటు బొప్పాయి తదితర పంటలకు ఇచ్చే నష్టపరిహారాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయి వారం రోజులు కావస్తున్నా జిల్లా కలెక్టర్, వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అంచనాయ కపోవడం బాధాకరమన్నారు. తక్షణమే జిల్లా యంత్రాంగం చొరవ తీసుకొని రైతుల నష్ట పరిహారం అంచనా వేయాలన్నారు. ప్రతి ఒక్క రైతుకు, కౌలు రైతులకు నష్టపరిహారం అందే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రామకృష్ణ, మద్దిలేటి, రమణయ్య, శ్రీనివాసులు, శేఖర్ పాల్గొన్నారు.



గడివేముల : రైతులతో మాట్లాడుతున్న కె. ప్రభాకర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు, తదితరులు

గడివేముల : అకాల వర్షంతో వడగండ్ల వానతో నష్టపోయిన ఉద్యాన పంటల రైతాంగానికి నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.లక్ష యాభై వేలు ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని గని, మంచాలకట్ట, జలకనూరు గ్రామంలోనీ వడగండ్ల వానతోదెబ్బతిన్న పొలాలను ఎపి రైతు సంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం కురవడంతో రైతాంగం అప్పులల్లో కురుకుపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాలజిల్లా రైతు సంఘం కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు మద్దిలేటి, రామకృష్ణ, రైతులు వెంకట్ రాముడు, రాముడు, నాగన్న, రైతులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి



ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రంజాన్, శ్రీరామనవమి పండుగలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్ రెడ్డి హిందూ, ముస్లీమ్ మత పెద్దలకు సూచించారు. శుక్రవారం ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి అధ్యక్షతన నంద్యాల జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయం నందు రంజాన్, శ్రీరామనవమి పండుగ ల సందర్భంగా పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రంజాన్, శ్రీరామనవమి పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని దానికి పోలీస్ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కొంతమంది ముస్లిం మత పెద్దలు రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసం ముగించడానికి రాత్రి వేళలో హెూటల్స్ మూసివేసే సమయం 11 గంటల వరకు ఉదయం నాలుగు గంటలకు తెరుచు విధంగా అనుమతి ఇవ్వాలనే విజ్ఞప్తి మేరకు జిల్లా ఎస్పీ సానుకూలంగా స్పందించి పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం టౌన్‌లో పికెట్స్,గట్టి బందోబస్తు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని, ఈద్గాల వద్ద పార్కింగ్ స్థలాలు కూడా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అందరు చట్టాలను గౌరవించాలని, వాటిని ఎవ్వరు అతిక్రమించరాదని, కులమతాలకు అతీతంగా అందరూ సోదర భావంతో కలిసిమెలిసి ఐకమత్యంతో మెలిగి పండుగల జరుపుకోవాలని సూచించారు. ఏవైనా వదంతులను సోషల్ మీడియా నందు ఏదేని వర్గమును రెచ్చగొట్టే విధంగా ఏదేని తప్పుడు సమాచారంను వ్యాప్తి చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. వదంతులు వచ్చిన ఎవరు నమ్మవద్దని తెలిపారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రజాశాంతికి భంగం కలిగించే అల్లరిమూకలపై నిఘా ఉంచామని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ఈ సమావేశానికి హాజరైన హిందూ, ముస్లిం మత పెద్దలు శాంతిభద్రతల విషయంలో పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్. రమణ, నంద్యాల టౌన్ డిఎస్పి సి.మహేశ్వర్ రెడ్డి, నంద్యాల టూ టౌన్ సిఐ ప్రభాకర్ రెడ్డి, నంద్యాల వన్ టౌన్ సిఐ కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సిఐ దస్తగిరి బాబు, నంద్యాల తాలూకా రూరల్ సిఐ రవీంద్ర, నంద్యాల 3 టౌన్ ఎస్సై నగీన, పీస్ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

సర్వే వేగవంతం చేయండి

- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సచివాలయాల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వే వేగవంతం చేసి ప్రభుత్వం నిర్దేశించిన సర్వీసులను నిర్ణీత కాలవ్యవధిలోగా అందించేందుకు ఎంపీడీవోలు ప్రత్యేక దష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వైఎస్ఆర్ సెంటినరీ హాలులో సచివాలయాల సర్వీసులు, ఉపాధి హామీ లేబర్ మొబలైజేషన్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు బరువు తక్కువగా ఉన్న పిల్లలు, 6 నుండి 19 సంవత్సరాల లోపు రక్త రక్తహీనత గల కౌమారదశ బాలికలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు తదితర వివరాల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పుట్టిన తేదీ సర్టిఫికెట్లు గడువులోపే జారీ చేయాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ, పుట్టిన తేదీ సర్టిఫికెట్లతో ఆధార్ అనుసంధానం, ఆయుష్మాన్ భారత్ సర్వే, హెల్త్ కార్డు సర్వే తదితర అంశాల్లో వచ్చే గురువారానికి పురోగతి కనిపించాలన్నారు. ఎపి సేవాసర్వీసులలో సాంకేతిక సమస్యలుంటే క్లియర్ చేసుకొని పెండింగ్ లేకుండా చూడాలన్నారు. పాణ్యం, బేతంచెర్ల తదితర మండలాల్లో సచివాలయాల సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ తక్కువగా ఉందని, ఇన్ టైమ్‌తో సమానంగా ఔట్ టైమ్ కూడా ఉండాలని ఆదేశించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది అందరూ హాజరు కావాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనుల్లో 574 ప్రగతిలో వున్న పనులను పూర్తి చేయడంతో పాటు ఇంకా మొదలు కాని పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. ఈనెల 27, 28, 29 తేదీలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆధార అప్‌డేషన్ పూర్తి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, డిఎల్‌డిఒ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో గల కస్తుర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 6,11 వ తరగతుల్లో ప్రవేశం కోసం 7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి, ఎక్స్ -ఆఫిసియో ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సమగ్ర శిక్ష నంద్యాల జిల్లా ఎం. అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష, నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో ఉన్న 27 కస్తుర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఆన్ లైన్ లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ నెల 27 నుండి ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అనాథలు, బడి బయటి పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ బాలికలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తామని చెప్పారు. దరఖాస్తులను http://apkgbv.apcf-ss.in%// సైట్ ద్వారా పొందవచ్చు నన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. సంబంధిత విద్యాలయం నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చు అని సందేహాలు ఉంటే 9000109934 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ట్యాబ్‌లలో పాఠ్యంశాలను వీక్షించండి : డిఇఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వం పంపిణీ చేసిన బైజూస్ ట్యాబులలో లెక్కలు, సైన్స్, సాంఘిక శాస్త్రాలకు సంబందించిన పాఠ్యాంశాలు ఉన్నాయని, ప్రతి విద్యార్థి ఉపాధ్యాయుడు ప్రతి రోజు ఉదయం ఒక గంట సాయంత్రం ఒక గంట ఈ వీడియోలను వీక్షించాలని డిఇఒ అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శుక్రవారం సంబంధిత ట్యాబులను ఇంటర్నెట్‌కు అనుసంధానం చేసి స్టేటస్‌ను అప్డేట్ చేయాలన్నారు. ట్యాబులలో సమస్యలుంటే సంబందిత సచివాలయం ఎడ్యుకేషనల్ అసిస్టెంట్‌కి ప్రధానోపాధ్యాయుడు తమ లాగిన్ నుంచి మెయిల్ ద్వారా తెలియజేసినట్లయితే వారే పాఠ శాలకు వచ్చి ట్యాబులను తీసుకెళ్ళి మైనర్ సమస్య ఉన్నట్లయితే వెంటనే పరిష్కరిస్తారనితెలిపారు. మేజర్ సమస్య ఉన్నట్లయితే సంబంధిత శాంసంగ్ కంపెనీ వారికి పంపించి బాగు చేయిస్తారని పేర్కొన్నారు.


ఉర్దూ మీడియం పాఠశాలల సమయ వేళల్లో మార్పు

జిల్లాలోని ఉర్దూ మీడియం ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్స్ ఉర్దూ మీడియం సమాంతర విభాగాల పాఠశాలల సమయ వేళ్లలో మార్పు చేసిన్నట్లు డిఇఒ అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24 నుండి ఏప్రియల్ 22 వరకు రంజాన్ కాలంలో పాఠశాల వేళలను ఉదయం 8.00 నుండి మధ్యాహ్నం 1.30 వరకు మార్పులు చేసిన్నట్లు తెలిపారు.

సిఎం చిత్ర పటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో కళ్యాణకట్ట నాయి బ్రాహ్మణులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పాలాభిషేకం నిర్వహించారు. నాయి బ్రాహ్మణులు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు జీవో నెంబర్ 50 విడుదల చేయడమే కాకుండా రాష్ట్ర దేవాలయాల పాలక మండలిలో నాయి బ్రాహ్మణులకు ఒకరికి అవకాశం కల్పించడం జరిగిందన్నారు. దీనితో పాటు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న నాయి బ్రాహ్మణులకు జీవో నెంబర్ 110ని విడుదల చేసి నెలకు 20 వేల రూపాయలు జీతం వచ్చే విధంగా చేశారన్నారు. శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డికి, జీవో విడుదల కావడానికి ముఖ్య పాత్ర పోషించిన ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్యకు జేఏసీ అధ్యక్షులు గుంతపల్లి రామదాసుకు, రమణ, ఏజీఎల్ నారాయణ, తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాలాభిషేకం కార్యక్రమంలో శ్రీశైలం నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మాయలూరి సాయి బాబా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సిఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

చలో పార్లమెంటు జయప్రదం చేయండి

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5వ తేదీన చేపట్టే చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాలలో జిల్లా ప్రజా సంఘాల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభాకర్ రెడ్డి చలో పార్లమెంటు వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ నాయకత్వంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ధనవంతులైన ఆదాని, అంబానీ వంటి వారికి సేవలు చేస్తోందన ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులను బిజెపి కాలరాస్తోందన్నారు. అదేమని అడిగిన వారిని జైలుకు పంపిస్తుందన్నారు. మతం పేరుతో ప్రజలను విడగొట్టి పరిపాలిస్తున్నదని అన్నారు. కార్మికులను యజమానులకు బానిసలు చేసే విధంగా మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పులు చేసిందని అన్నారు. కార్మికుల నియామకాలు తొలగింపులో యజమాని ఇష్టారాజ్యం చేసిందన్నారు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామని అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తన రైతు వ్యతిరేక విధానాలతో వారిని ఆత్మహత్యలకు పురిగొల్పిందని ఆరోపించారు. గత ఐదు సంవత్సరాలు 28,572 మంది రైతుల ఆత్మహత్య చేసుకున్నారన్నారు. వాటిని పరిశీలించాల్సిన మోడీ రైతులకు, వ్యవసాయానికి నష్టం కలిగించే విధంగా వ్యవసాయ నల్ల చట్టాలలను, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లకు రైతు వ్యతిరేకంగా చట్టాలకు పార్లమెంటులో రాష్ట్రంలోని పాలక పక్ష వైసిపి, ప్రతిపక్ష టీడీపీ ఎంపీలు మద్దతు ఇచ్చారని అన్నారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీ ప్రదర్శనలో పాల్గొనడం తప్ప మరొకటి మార్గం లేదని వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.ఏసురత్నం,ఏ.నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు రణధీర్, రత్నమయ్య, పి.నరసింహ, నక్కి శ్రీకాంత్, కె.ఎండి గౌస్,నరసింహ నాయిక్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కె. ప్రభాకర్ రెడ్డి, టి, రమేష్ కుమార్, ఎం. నాగేశ్వర రావు, తదితరులు

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి.

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని ఓటర్లను ఆధార్ తో అనుసంధాన ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సామూన్ మండల తాసిల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో పిఓఎల్‌ఆర్ రీ సర్వే, ఫారం-6బి, భూసేకరణ, ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవిన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ టి.నిశాంతితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో 74,583, ఆత్మకూరులో 15,830, వెలుగోడులో 11,501మంది ఓటర్లను ఆధార్ తోలి అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. ఈనెల 25, 26 తేదీలలో ప్రత్యేక డ్రైవ్ పెట్టి పెండింగ్ లో ఉన్న మండలాల్లో ఓటర్లను ఆధార్ తో అనుసంధాన ప్రక్రియను వేగవతం చేసి ఈ నెల 30వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. క్రాఫ్ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో సరిహద్దు రాళ్లు నాటే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. మండలాల వారీగా ఇళ్ల పట్టాలు మంజూరు చేసిన లబ్ధిదారుల వివరాలను సేకరించి అనాలసిస్ చేసి రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఎస్డిసి కామేశ్వరరావును కలెక్టర్ ఆదేశించారు. చుక్కల భూములకు సంబంధించి కోర్టులలో పెండింగ్ ఉన్న 6 లికంటెంప్ట్ కేసులను క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి మాట్లాడారు. సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు శ్రీనివాసులు, వెంకట్ రెడ్డి, ఎం దాసు, అన్ని మండలాల తాసీల్దార్లు,కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి అన్నారు. అహోబిలం సెక్టార్ 15వ అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా గర్భవతులు, బాలింతల కోసం చిరుధాన్యాలు, బాలామృతంతో చేసే రకరకాల వంటలపై డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ బాలింతలకు, గర్భవతులకు చిరుధాన్యాలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు అన్నారు. అంగన్వాడి టీచర్లు అరుణ, ముంతాజ్, సుశీల,గౌసియా, మహబూబ్ బి, విజయ, అంగన్వాడి ఆయాలు పాల్గొన్నారు.

బాలామృతం పిల్లలకు బలమైన ఆహారం

బాలామృతం పిల్లలకు ఎంతో బలమైన ఆహారమని అంగన్వాడి కార్యకర్తలు బద్రున్, వేణమ్మ తదితరులు అన్నారు. పట్టణంలో 8, 11,12 కేంద్రాలకు చెందిన అంగన్వాడి కార్యకర్తలు పౌష్టిక ఆహార పక్షోత్సవాలలో భాగంగా బాలామృతంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భ ంగా బాలమృతం వలన అనగా ఉపయోగాలు ఉన్నాయన్నారు. తక్కువ బరువున్న చిన్నారులకు బాలామృతంను ఎన్నో రకాలుగా చేసుకుని తినడం వలన బరువు పెరుగుతారన్నారు. అలాగే చిరుధాన్యాల ఉపయోగాలను వివరించారు. **చిరుధాన్యాల ఉపయోగాలపై అవగాహన:** పట్టణంలోని ఏడవ అంగన్వాడి కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు చిరుధాన్యాల ఉపయోగాలు, బాలమృతంపై అవగాహన కార్యక్రమాన్ని అంగన్వాడీ కార్యకర్త శైలజ నిర్వహించారు.



మాట్లాడుతున్న అంగన్వాడి కార్యకర్తలు

ఎస్సీ రైతులకు అమృత్ జలధార రుణాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అమృత్ జలధార పథకం ద్వారా ఎస్సీ రైతులకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు యస్. శ్రీనివాస కుమార్ తెలిపారు. నీటి వసతులు లేని షెడ్యూల్డు కులాలకు చెందిన రైతుల భూములకు నీటి వసతి కల్పించేందుకు ఆర్థక సాయం అందిస్తామని పేర్కొన్నారు. కనీసం 2 ఎకరాల 50 సెంట్ల భూమి కలిగి ఉండి వార్షిక ఆధాయం రూ.3 లక్షల లోపు ఉన్న రైతులు అర్హులని తెలిపారు. బోర్ బావులు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింకర్స్ ఏర్పాటుకు చేయూతనందిస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్టు ఖరీదులో 50 శాతం సబ్సిడీ గాని, రూ.50,000 రాయితీ గాని మించకుండా మంజూరు చేస్తామని తెలిపారు. పథకం పొందాలంటే తప్పని సరిగా ఏ ఇతర పథకాల ద్వారానైనా బ్యాంక్ ద్వారా 2022-2023 ఆర్థిక సంవత్సరము రుణం పొంది ఉండాలని స్పష్టం చేశారు. ఎస్సీ నిరుద్యోగు యువతకు ట్రాక్టర్, ట్రాలీ, కమర్షియల్ వాహనాలు, వేర్ హౌసెస్, తదితర స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు కార్యనిర్వాహక సంచాలకులు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 27 తేదీలోగా జిల్లా షెడ్యూల్డు కులముల సేవా సహకార సంఘము, కర్నూలు కార్యాలయములో అందజేయాలని సూచించారు.

ఐదుగురిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల పరిధిలోని బలపాలపల్లి గ్రామంలో శ్రీ బీరప్ప మల్లికార్జున స్వామి ఉత్సవాలలో భాగంగా చోటు చేసుకున్న ఘర్షణలో ఐదుగురితో పాటు మరికొంతమందిపై కేసు నమోదు చేసినట్లు సిఐ ప్రీతం రెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు గ్రామం సర్పంచ్ పెద్దగాళ్ల చిన్న మద్దమ్మ భర్త పెద్దగా ళ్ల ఎద్దులన్న గ్రామంలోని ఉత్సవాల సందర్భంగా ఆర్కెస్ట్రా నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన పోలూరు వెంకటేశ్వర రెడ్డి రాఘవరెడ్డి శ్రీనివాసరెడ్డి, జవాజి వెంకటేశ్వర్లు, కానాల సేసి రెడ్డితోపాటు మరి కొంతమంది కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఎద్దులన్న పై దాడి చేసి కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంతో ఎస్సీ ఎస్టీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

నేడు పంచాయతీ మార్కెట్ వేలం పాటలు

ప్రజాశక్తి -శిరివెళ్ల



మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ మార్కెట్ వేలం పాటలు శనివారం నిర్వహిస్తున్నట్టు ఈఓఆర్‌డి సల్మాన్ రాజ్ శుక్రవారం తెలిపారు. వారపు సంత మార్కెట్, దినసరి మార్కెట్, పశు వదశాల మార్కెట్లకు సంబంధించి వేలం పాటలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేలం పాటలను సర్పంచ్ లక్కకుల సలమ్మా ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామ న్నారు. వారపు సంతమార్కెట్‌కు రూ.50వేలు, దినసరి మార్కెట్‌కు రూ.40వేలు, పశు వదశాలకు రూ.10వేలు డిపాజిట్ చెల్లించి, రెండు లక్షలకు ఆస్తి ధ్రువీకరణ పత్రము సమర్పించి బహిరంగ వేలం పాటల్లో పాల్గొన వచ్చున్నారు. అలాగే యరగుంట్లలోనూ గ్రామంలో కూడా వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



ఎడ్ల పందెలను ప్రారంభిస్తున్న డాక్టర్ రాకేష్ రెడ్డి

ఎద్దుల పోటీలు ఉత్సాహానిస్తాయి : రాకేష్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గ్రామీణ క్రీడలు ప్రజలను ఎంతో ఉత్సాహన్ని ఇస్తాయని, ఎడ్ల పందెలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటాయని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జూపల్లె రాకేష్ రెడ్డి అన్నారు. ఉగాది పండుగను పురుష్కరించుకొని శుక్రవారం సాంబవరం గ్రామములో జరిగిన ఎడ్ల పందెలను జూపల్లె రాకేష్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమములో జూపల్లె ప్రభాకర్‌రెడ్డి, మద్దిలేటిరెడ్డి, శేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, గోపాల్రేడ్డి, జనాత్మక రెడ్డి, ఆదినారాయణ, సుములమ్మ, జింకల కొండన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఎస్ కె ఆర్ చర్మ వ్యాధుల క్లినిక్ ప్రారంభిస్తున్న ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, చిత్రంలో చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ కౌశిక్ కుమార్

చర్మ వ్యాధుల లేజర్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల సంజీవ నగర్ గేట్ దగ్గర ప్రముఖ చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ కౌషిక్ కుమార్ అత్యాధునిక లేజర్ పరికరాలతో ఎర్పాటు చేసిన చర్మ వ్యాధుల క్లినిక్‌ను ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరికరాలతో చర్మ వ్యాధుల క్లినిక్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. డాక్టర్ కౌషిక్ కుమార్ మాట్లాడుతూ అవాంఛిత రోమాలు లేజర్ ద్వారా సురక్షితంగా తొలగించ వచ్చున్నారు. ఈ కార్యక్రమం లో భగవత్ సేవా సమాజ్ అధ్యక్షులు సూరయ్య, పాత్రికేయులు జనార్ధన్ రెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ శ్రీకాంత్, చిన్న పిల్లల వైద్యులు సురేంద్ర రెడ్డి,మధుసూదన డ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బీసీ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ఇల్లూరు కొత్తపేటకు చెందిన మాజీ సర్పంచ్ యనగనూరు వెంకటరామిరెడ్డి మేనల్లుడు కొమ్మిరెడ్డి మౌళీశ్వరరెడ్డి (42) విద్యుత్ షాక్‌తో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిలు కొమ్మిరెడ్డి చంద్రమౌళీశ్వర రెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బీసీ మాట్లాడుతూ చంద్రమౌళీశ్వర రెడ్డి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.



కొమ్మిరెడ్డి చంద్రమౌళీశ్వర రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వేసవి దృష్ట్యా జిల్లాలో ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సామూన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో తాగునీటి సరఫరా, వడగాలులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతి టి, అడిషనల్ ఎస్పీ రమణ, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ మనోహర్, జిల్లా పరిషత్ డెప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సామూన్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఎండిపోయిన బోర్లకు డీపనింగ్, ఫ్లషింగ్ తదితర మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పాఠశాలలు, గ్రామాలలో ఫంక్షన్‌లో లేని ఆర్ఓ ప్లాంట్‌లను గుర్తించి రిపేర్లు చేయాలన్నారు. నంద్యాల పట్టణంలో మరమ్మతులకు గురైన మూడు పవర్ బోర్‌వెల్స్‌ను తక్షణం వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

పారిశుధ్య పనులను ముమ్మరం చేయడంతో పాటు దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ఓఆర్‌హెచ్ఎస్ ట్యాంకులను శుభ్రపరచడంతో పాటు క్లోరినేట్ చేసిన నీటిని సరఫరా చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో ఈఓఆర్డీలు, పంచాయతీ సెక్రటరీల ద్వారా పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలన్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్ చేయడంతో పాటు అత్యవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని డిఎంహెచ్ఓ మలేరియా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వడగాల్పులపై అప్రమత్తంగా ఉండండి ఎండ తీవ్రత, వడగాల్పుల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వేసవికాలం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఐఎండి హెచ్చరిస్తున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ మున్సిపల్, మండల కేంద్రాల్లో చలివేంద్రాలు, చలవ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ పోలీసులకు కూలింగ్ జాకెట్లు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మండల స్థాయిలో ఎండ తీవ్రత, వడగాలులపై అధికారులతో సమీక్షలు నిర్వహించుకొని చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిపిఓ శ్రీనివాసులు, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

విద్యార్థి దశ నుండే వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన అవసరమని, తద్వారా మంచి ఫలితాలు పొందవచ్చని వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షులు విజయ్ అన్నారు. మండలంలోని అహోబిల గ్రామం గిరిజన ఆశ్రమ పాఠశాలలో వినియోగదారుల రక్షణ చట్టంపై శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వినియోగదారుల రక్షణ మండల అధ్యక్షులు విజయ్ ఆధ్వర్యంలో గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో కన్స్యూమర్ క్లబ్ ఏర్పాటు చేయడం జరిగింది. కన్స్యూమర్ క్లబ్ కు అధ్యక్షులుగా జి తిక్కస్వామి (ప్రధానోపాధ్యాయులు), కార్యదర్శిగా కే సరిత (ఉపాధ్యాయుని), కోశాధికారిగా మహబూబ్ బాషా, 6,7,8,9 తరగతులకు చెందిన విద్యార్థినీ విద్యార్థులను సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం సివిల్ సప్లై వారిచే ప్రచురింపబడుతున్న మేలుకొలుపు అనే త్రైమాషిక పత్రికను విడుదల చేశారు.

25న సంత మార్కెట్ వేలంపాట

ప్రజాశక్తి - ప్యాపిలి

ప్యాపిలి పట్టణానికి సంబందించిన 25న సంత మార్కెట్ వేలం నిర్వహిస్తున్నామని పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శివకుమార్ గౌడ్ తెలిపారు. వారు మాట్లాడుతూ 23-24 సంవత్సరానికి సంబంధించిన వారపు సంత మార్కెట్ దిన కూరగాయల బస్టాండు మాంసపు మార్కెట్ శనివారం ఉదయం 11 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈఓఆర్‌డి బాలకృష్ణుడు ఆధ్వర్యంలో బహిరంగ వేళం నిర్వహిస్తారని వేలంపాటలలో పాల్గొనే వారు గ్రామపంచాయతీ తెలిపిన ధరావత్తు మొత్తమునునగదు లేదా డీడీ ద్వారా ఆరు లక్షల 50 వేలు చెల్లించి పాటలో పాల్గొన్నాలని తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు గ్రామ పంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండరాదన్నారు. మరిన్ని పూర్తి వివ రాలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించగలరని తెలిపారు.

ఆటో ఢీకొని ఇద్దరికీ గాయాలు

ప్రజాశక్తి - మహానంది

ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికీ గాయాలైన సంఘటన మండలంలోని తుమ్మడపల్లె గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. తిమ్మాపురం నుండి నంద్యాలకి వెళ్తున్న ద్విచక్ర వాహనం నంద్యాల నుండి మహానందికి వస్తున్న ఆటోను ఢీకొని ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో గాయాలు అయిన వారిని చికిత్స నిమిత్తం అక్కడి స్థానికులు వెంటనే 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారని సమాచారం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వైభవంగా రాయబారాది మహోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానంలో రాయబారధి మహోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం చౌడేశ్వరి దేవి బ్రహ్మో త్సవాల్లో భాగంగా రాయబారది మహోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారికి కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానానికి వచ్చిన భక్తులకు ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వసతులను కల్పించారు. రాత్రి ఏర్పాటుచేసిన పౌరాణిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి

ముగిసిన ధార్మిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని జూనూతల గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రామాలయంలో జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకట్ రెడ్డి సమక్షంలో గత నాలుగు రోజుల నుండి హిందూ ధార్మిక ఆధ్యాత్మిక ప్రవచనాలను ప్రజలకు వివరించారు. నెరవాడ వాస్తవ్యులు రామ సుబ్బారెడ్డి చేసిన ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అర్చకులు శేషగిరిరావు, మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, చల్లా శ్రీనాథ్ రెడ్డి, మూరం ప్రకాష్ రెడ్డి, రామ సుబ్బన్న, హరి సర్వోత్తమ్ రెడ్డి, భజన బృందాలు, చెక్క భజన బృందాలు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - శిరివెళ్ల



పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైం దని టిడిపి మాజీ వార్డ్ మెంబర్ జి కరీం ముస్లిం సోదరులకు శుక్రవారం శు భాకాంక్షలు తెలి పారు. ఈ పవిత్ర మాసం పేదలకు సేవ చేసేలా ప్రజల్లో స్ఫూర్తిని కలిగించాలని కోరుకుంటున్నట్లు జీ కరీం తెలిపారు. ఈమేరకు టిడిపి కార్యాలయంలో ముస్లిం సోదరులు, నేతలు, మత పెద్దలతో కలిసి రంజాన్ క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు.



బోనస్ నగదును అందజేస్తున్న దృశ్యం

విజయ డెయిరి పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని కునుకుంట్ల గ్రామంలో విజయ డెయిరి పాడి రైతులకు బోనస్ నగదును గూడాల సోదరులు మురళీధర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం అందించారు. విజయ డెయిరి అధ్యక్షులు ఎస్‌వి జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం బిఎంసిసి కొలిముక్ల పరిధిలో ఉన్న కునుకుంట్ల గ్రామంలో పాడి రైతులకు లీటరుకు రెండు రూపాయలు చొప్పున అదనంగా బోనస్‌ను అందించటం జరిగిందని మేనేజర్ నాగరాజు తెలిపారు. పాడి రైతులకు లాభసాటిగా బోనస్‌ను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

మంచి ఫలితాలతో ఆదర్శంగా నిలవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

పదవతరగతి విద్యార్థులు మంచిఫలితాలు సాధించి మండలానికే ఆదర్శంగా నిలవాలని ఎస్ఐ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఏపి మోడల్ స్కూల్‌లో పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రిన్సిపల్ చంద్రసేనారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ రమేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఉజ్జ్వలభవితను పొందాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ చంద్రసేనారెడ్డి మోడల్ స్కూల్ ప్రారంభించిన నాటి నుండి ప్రతి సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణతను సాధిస్తూ ప్రతిభా అవార్డులతో పాటు ఐఐఐటి సీట్లు సాధించారని వివరించారు. ఈకార్యక్రమంలో మోడల్ స్కూల్ అధ్యాపకులు రాముడు, గురప్ప, శివలింగారెడ్డి, మధుసూదన్, ప్రసాద్, నిర్మలా ప్రశాంతి వరలక్ష్మి,అరుణ,చంద్రకళ,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బిసి మహిళలకు టిడిపి సముచిత స్థానం : బిసి



బనగానపల్లె : కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసుకుంటున్నా మాజీ ఎమ్మెల్యే బీసీ, బీసీ సెల్ నాయకులు



చాగలమర్రి : కేక్ కోసి సంబరాలు జరుపుకుంటున్న నాయకులు



కోవెలకుంట్ల: కేక్ తినిపించుకుంటున్న నాయకులు



బండి ఆత్మకూర్ :కేక్ కోసి సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

ప్రజాశక్తి - బనగానపల్లె

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ మహిళను నిలిపి బీసీలకు సముచిత స్థానం కల్పించారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం టిడిపి బీసీ సెల్ నాయకుల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి ఎమ్మెల్సీగా చేనేత (పద్మ శాలి) ఆడపడుచు పంచుమర్తి అనూరాధ విజయం సాధించడంతో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు కటౌట్‌కు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం కొండు భూషన్న , బీసీ సెల్ ఫోర్మెన్ విఎన్ చౌడయ్య, బీసీ సెల్ నాయకులు కె.పి వెంకటేశ్వర్లు, వెంకటరమణ, బాబు, పల్లా తిమ్మరాజు, ప్రహ్లాదుడు, మధుసూదన్, గౌరిగే నరసింహుడు, లక్ష్మణ్ కుమార్, సన్నపాపోడు, పొట్టి పాడు సుబ్బారెడ్డి, యాగంటి పల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వర రెడ్డి, సంకేశ్వర్ రెడ్డి, వేములపాడు సర్పంచ్ గురప్ప జోలాపురం గంధం హుస్సేని, కటికవానికుంట శ్రీనివాసులు, అవుకు తిక్కన్న తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాడం ఖాయమని నంద్యాల పార్లమెంట్ బిసి సెల్ ఫోక్ పర్సన్ సల్ల నాగరాజు యాదవ్ తెలిపారు. శుక్రవారం స్థానిక శివాలయం కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పంచుమర్తి అనురాధ గారు ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా నంద్యాల పార్లమెంటు బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు తెలుగుదేశం పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పార్టీ మీద పూర్తిస్థాయిలో అన్ని వర్గాల నుండి ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు చేపట్టారు ఆయన రాజకీయ చరిత్రతోనే 23 మంది ఎమ్మెల్యేలతో ఓట్లు లెక్కించగలిగి అనురాధ గెలుపుకు కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియు రాష్ట్ర కార్యదర్శి గుట్ట నరసింహులు, వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి,నారాయణరెడ్డి, సల్లాదనంజేయుడు, టైలర్ బాష,చోటు, కామిశెట్టి రమేష్, కసినేని ఓబులేసు, గుణ, భాష, సంజీవ, మోహన్ తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** జగన్ పనైపోయిందని 2024 ఎన్నికల్లో టిడిపి గెలుపును ఎవరు ఆపలేరని రాష్ట్ర హజ్ కమిటీ మాజీ చైర్మన్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మోమిన్ అహ్మద్ హుసేన్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి మూడు చోట్ల పోటీ చేయగా గెలిచారన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానంలో పోటీ చేయగా టిడిపి అభ్యర్థి గెలుపొందారని తెలిపారు. **బండి ఆత్మకూర్ :** ఎమ్మెల్సీ అభ్యర్థిగా టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనురాధ విజయం సాధించడంపై మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. టిడిపి మండల అధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి, తెలుగు యువత శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు వి మల్లేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ నాయకులు జిసి పాలెం లింగారెడ్డి, టిడిపి ప్రధాన కార్యదర్శి డి సిద్దయ్య, చెన్నారెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, జాకీర్ ఖాన్, జాలనందయ్య, తదితరులు పాల్గొన్నారు. **కోవెలకుంట్ల:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి గెలుపుతో అరాచక పాలనకు అంతం చేయడంలో విజయం సాధిస్తామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీ గడ్డం నాగేశ్వర్ రెడ్డి, లింగాల నాయుడు, రేవనూరు ఏవి సుబ్బారెడ్డి, గుంజలపాడు సుబ్బారెడ్డి, సాహెబ్, మాధవ, షమీన్ భాష, దండు మబ్బులు మొదలగు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం : కాటసాని ఓబుల్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

స్వర్గీయ కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైసిపి యువ నాయకులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో మండలంలోని బీరవోలు గ్రామానికి చెందిన యూత్‌కు రూ.30 వేలు విలువ చేసే సెటిల్ బ్యాట్ల కిట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాటసాని ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ తన అన్న స్వర్గీయ కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. యువతకు క్రీడల్లో తమ ప్రతిభను వెలికి తీయడానికి తన వంతు సహాయ సహకారాలతో జిల్లా, రాయలసీమ జోనల్ స్థాయి టోర్నమెంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయనితెలిపారు. నియోజకవర్గం అభివద్ధిని ఆకాంక్షించే నాయకులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి యువత అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, బీరవోలు సర్పంచ్ పల్లె నాగేశ్వర రెడ్డి, నాయకులు బెలుం బాలిరెడ్డి,బెలుమ్ సుబ్బారాయుడు,పెద్ద నారాయణ,ఓల్పు శ్రీనివాస రెడ్డి,బేలుం గోపాల్ రెడ్డి,చిన్న నారాయణ బీరవోలు యూత్ సభ్యులు, రామాంజనేయులు, రామసుబ్బారెడ్డి,బాలిరెడ్డి, రాజు,.శివ రాజు,సుదర్శన్ రెడ్డి,.సురేష్,సుదర్శన్ పాల్గొన్నారు.



సెటిల్ బ్యాట్లను పంపిణీ చేస్తున్న కాటసాని ఓబుల్ రెడ్డి

టిబి రహిత జిల్లాగా మారుద్దాం : డిఎంహెచ్ఒ



ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాను టిబి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వి.1వెంకటరమణ అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం క్షయ వ్యాధి నివారణ శాఖ ఆధ్వర్యంలో డిఎంహెచ్ఓ కార్యాలయం నుండి సాయిబాబా నగర్ ఆర్చి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా క్షయ నివారణాధికారి బాలాజీతో కలిసి డిఎంహెచ్ఓ జెండా ఊపి ప్రారంభించారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు టిబి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది టిబిని ఓడిద్దాం దేశాన్ని గెలిపిద్దాం అనే నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా టిబి వ్యాధిగ్రస్తులు 3,682 మంది ఉన్నారని, వీరు రెగ్యులర్‌గా మెరుగైన వైద్యం తీసుకోవాలని తెలిపారు. క్రమం తప్పకుండా మందులు వాడటం వలన టిబి నుండి బయటపడొచ్చన్నారు. అనంతరం సాయిబాబా నగర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. మాత శిశు వార్డు సమావేశ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలత, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ప్రసాద్ రావు , డిసిహెచ్ఎస్ జఫ్రుల్లా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రభావతి పాల్గొన్నారు. **చాగలమర్రి :** గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యులు అంజలి, ఇమ్రాన్లు తెలియజేశారు. చాగలమర్రి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక వైద్యశాల పరిధిలో క్షయవ్యాధి మందులను వాడుతున్న 21 మందికి రూ.500ల విలువైన నిత్యవసర సరుకులను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిక్షయ మిత్రల ద్వారా 6నెలల పాటు క్షయ వ్యాధిగ్రస్తులకు నిత్యవసరాలను పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ రమణమ్మ,హల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ. సూపర్వైజర్లు రామచంద్రుడు,సీతారాముడు,ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు. **సిరివెళ్ల :** ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా డాక్టర్ విజయకుమార్ క్షయ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. డాక్టర్ సలహా మేరకు ప్రభుత్వం అందిస్తున్న ఆరు నెలల మందులను క్రమంతప్పకుండా వాడితే క్షయవ్యాధిని నివారించవచ్చు అని తెలిపారు. ఈకార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామ్మోహన్ రెడ్డి కేజీబీవీ ప్రధానోపాధ్యాయు రాలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పట్టణంలో ఆత్మకూరు టిబి యూనిట్ టిబి సూపర్ వైజర్లు రవికుమార్, మస్తానయ్య అధ్యక్షతన ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుండి గౌడ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగ మునిసిపల్ చైర్ పర్సన్ డాక్టర్ అసియా మారూఫ్, వైద్యాధికారులు పవనకుమార్, గోపాల్, బెంగురియన్,మొహమ్మద్ బేగ్, సి హెచ్.ఓ మోహన్ ,సూపర్వైజర్లు రమణమ్మ ,మాలిక్ బాషా,సౌజన్య, మెరిబా కో-ఆర్డినేటర్ జుల్ఫి ,వైద్య సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసియా మారూఫ్ మాట్లాడుతూ ట్రూ నాట్,సీబీ నాట్ వాటి అధునాతన గళ్ళ పరీక్ష పరికరాలతో క్షయ వ్యాధిని గుర్తించవచ్చునన్నారు. **డోన్ :** క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా డోన్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. టీబీ నివారణ, ఆరోగ్య పరిరక్షణ గురించి పాఠశాల సమీపంలోని ఇళ్ళ వారికి అవగాహన కల్పించారు. బి.ఆర్.అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపల్ గీత, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పవతి, సిబ్బంది వెంకటేశ్వర్లు, ఇంద్రావతి, కల్పన, ఉమా మహేశ్వరి, సునీత, మాధవి పాల్గొన్నారు. **మహానంది :** క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం దేశాన్ని కాపాడుదాం అని ఐ.ఎం. ఏ. స్టేట్ ప్రెసిడెంట్ జి. రవికృష్ణ అన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులు జిల్లాలో 3682 మందికి రోగ నిర్ధారణ అయిందన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ టీబీ మరియు లెప్రసి ఆఫీసర్ బాలాజీ, డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫ్రిల్ల, తిమ్మాపురం ప్రాథమిక వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, రూపేంద్ర నాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మండలంలోని తుమ్మలూరు, భానుముక్కల, వేంపెంట, మిట్ట కందాల , ఇస్కాల, రుద్రవరం, మద్దూరు గ్రామాలలోని సబ్ సెంటర్లలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారిని ఇవి నాగలక్ష్మి దేవి, గులాబ్‌షా, హెల్త్ సూపర్వైజర్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.



పాములపాడులో..